# ఆర్థిక, పాలనా సంస్కరణలు : ఉద్యోగ భద్రత - సమ్మెహక్కు

డా॥ కె.బాలగోపాల్

కాగల రోజులలో పనులు చేసుకోకపోతే కాలాతీతం అయిన తరువాత ఎంత ప్రయత్నించినా ఫలితం ఉండకపోవచ్చు. ఈ సాధారణ లోకజ్ఞానాన్ని ఉద్యోగ సంఘాలు అనుభవపూర్వకంగా తెలుసుకునే రోజులు దగ్గరపడ్డాయి.

రాజ్యాంగము, సర్వీస్ నియమాలు, ప్రభుత్వ పాలనా విధానాలు కలిసి ప్రభుత్వ ఉద్యోగులకు ఒకవైపు ఉద్యోగ భద్రత, ప్రమోషన్లు, ఇంక్రిమెంట్‌లు, ఎవరికీ లేని కరువుభత్యం, పెన్షను,కొసరుగా ఎల్.టి.సి.వంటి సదుపాయాలు ఇచ్చి మరొకవైపు వారి స్వేచ్ఛను విపరీతంగా కట్టుదిట్టం చేసాయి. మొదటి దానితో సంతృప్తి పడి రెండవదాని గురించి ఉద్యోగులు అలజడి చేయలేదు. ఇప్పుడు మొదటిది పోయి రెండవది మాత్రమే మిగిలే పరిస్థితి వచ్చింది.

ఉద్యోగ భద్రత ఇప్పుడు అభివృద్ధి సిద్ధాంతంలో ఒక చెడ్డమాట అయిపోయింది. పనిలో భద్రత కోరుకోవడం అంటే వెనుకబాటుతనాన్ని కోరుకోవడమే నంటున్నారు. ఈ మాటలను అనేది చాలా భద్రమైన స్థితిగతులున్న ఆర్థిక శాస్త్రవేత్తలు, సలహాదారులు కాగా, వాటిని నమ్మడానికి సులభంగా సిద్ధపడుతున్నది, దేశాన్ని పరిపాలించే ఐ.ఎ.ఎస్. ఆఫీసర్లు, రాజకీయ నాయకులు.

తమ ఉద్యోగ భద్రతకు ఏమీ లోటు రాదని ఐ.ఎ.ఎస్. అధికార్ల ధీమా. ఆ స్థాయిలో పదవులు ఇప్పట్లో కాంట్రాక్టుకు ఇవ్వబోరని వారికి నమ్మకం. రాజకీయ నాయకుల మాటకొస్తే గెలిచే సీటుకు టిక్కెట్టివ్వకపోతే వారెంత అల్లరి చేస్తారో మనకందరికీ తెలుసు. దానికి వారి యోగ్యతతోను చేసిన పనితోను ఏమీ సంబంధం లేదు. భద్రమైన సీటు కావాలంతే. భద్రతను వీరిద్దరూ ఈసడించుకోవడం ఇతరుల విషయంలోనే తప్ప తమ విషయంలో కాదు. అన్ని నీతులలాగ ఆర్థిక శాస్త్ర నీతులు కూడ ఇతరులకు చెప్పడానికే.

కానీ ఉద్యోగుల పౌరహక్కుల మీద నిర్బంధం చెక్కుచెదరకుండ ఉండడమే కాక పెరుగుతున్నది. అత్యవసర సర్వీసుల చట్టాన్ని ప్రయోగించి ఉద్యోగుల ఆందోళనలను నిషేధించడానికి ప్రభుత్వాలు వెనుకాడడంలేదు. నిషేధించిన తరువాత సమ్మెలో పాల్గొంటే ఏ విచారణ లేకుండ బర్తరఫ్ చేయవచ్చునని తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసేసింది. అది చెల్లదని ప్రకటించమని ఉద్యోగులు కోర్టుకెక్కితే సుప్రీంకోర్టు వారినే తిట్టింది. సమ్మె చేయలేకపోతే కనీసం ప్రచారమయినా చేసుకోవచ్చునా అంటే సర్వీస్ నియమాలు భావప్రకటనా స్వేచ్ఛపైన బరువైన ఆంక్షల పెట్టాయి. అంతా బాగున్న రోజులలో ఈ ఆంక్షల వల్ల తమకు పెద్దగా నష్టమేమీ లేదని సగటు ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలు భావించడం జరిగింది. ప్రభుత్వ ఉద్యోగులను 'సర్కారు అల్లుళ్ళు' అని ఉత్తర భారతదేశంలో అంటుంటారు. అది పూర్తిగా నిజం కాకపోయినా, అల్లుడి హోదాను పోలిన భాగ్యం ఉన్న రోజులలో భావప్రకటనా స్వేచ్ఛ అంత ముఖ్యమైన విషయంగా తోచి ఉండకపోవచ్చు. కానీ ఆ హోదా పోయి కాంట్రాక్ట్ ఉద్యోగులుగా మారిపోయే స్థితి దాపురించిన తరువాత, కనీసం గొంతు విప్పే స్వేచ్ఛ అయినా లేకుంటే ఎట్లాగని ఉద్యోగ సంఘాలిప్పుడు ఆందోళన చెందుతున్నాయి. 'అల్లుళ్ళుగా' ఉన్న రోజులలోనే ఆందోళన చెంది ఉంటే ఆ స్వేచ్ఛను పొందడం కొంతయినా సులభం అయివుండేదేమోగానీ ఇప్పుడంత సులభం కాదు.

ప్రభుత్వ ఉద్యోగులుకు సమ్మెహక్కు లేకుండా చేసిన సర్వీస్ నియమాలు రాజ్యాంగ విరుద్ధం కాదని నలభై యేళ్ళనాడు చెప్పిన తీర్పులోనే సుప్రీంకోర్టు భావ ప్రకటన స్వేచ్ఛ పైన సర్వీస్ నియమాలలో పెట్టిన పూర్తి నిషేధం చెల్లదని కూడ చెప్పింది. అంటే ధర్నాలు, ఊరేగింపులు, ప్రభుత్వ విధానాలను విమర్శించే మాటలు, రాతలు పూర్తిగా నిషిద్ధం కావు. వాటి పైన హేతుబద్ధమైన పరిమితులు మాత్రమే పెట్టవచ్చునని సుప్రీంకోర్టు కామేశ్వర్ ప్రసాద్ వర్సస్ స్టేట్ ఆఫ్ బీహార్ కేసులో 1960లలో తీర్పు ఇచ్చింది. ఏది హేతుబద్ధం అనేదానికి నిర్దుష్టమైన ప్రమాణాలేవీ లేనందువల్ల ఇది పూర్తిగా సంతృప్తికరమైన స్థితి కాకపోయినప్పటికీ ప్రస్తుతమున్న రాజ్యాంగంలో ఈ మేరకు రక్షణ ఉంది. అందుకు విరుద్ధమైన సర్వీస్ నియమాలు చెల్లవనేది సుప్రీంకోర్టు ఆనాడు ఇచ్చిన తీర్పు సారాంశం. రాజ్యాంగం ఉనికిలోకి రాకముందు, ఉద్యోగులు వలస పాలనా యంత్రాంగంలోని స్థానిక కాల్బలంగా ఉన్న రోజులలో రాసిన సర్వీస్ నియమాలు అందుకు విరుద్ధంగా ఉండడంతో ఆశ్చర్యపోవలసిందేమీ లేదు. రాజ్యాంగం ఉనికిలోకి వచ్చిన తరువాత కూడ అవి కొనసాగడం ఆశ్చర్యపోవలసిన విషయం. సుప్రీంకోర్టు అవి రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించిన తరువాత కూడ కొనసాగడం ఇంకా ఆశ్చర్యపోవలసిన విషయం.

ఆ నియమాలు రాజ్యాంగ విరుద్ధం అని సుప్రీంకోర్టు ప్రకటించిన తరువాత అవి కాగితంమీద ఉంటే మాత్రం నష్టమేమిటని అనుకోవడం పొరబాటవుతుంది. అవి కాగితం మీద ఉన్నంతకాలం ప్రభుత్వం వాటిని వాడుకుంటూనే ఉంటుంది. వాటికి గురయిన ఉద్యోగులు ఒక్కొక్కరుగా కోర్టులో న్యాయం పొందాలి. ఈ లోపల నాలుగైదేళ్ళు కష్టాలనుభవించాలి. ఇది ఊహాత్మకంగా అంటున్నదికాదు. మాలమహానాడు నాయకులలో ఒకరయిన పి.వి.రావును రాష్ట్ర ప్రభుత్వం 'ప్రభుత్వ విధానాలను విమర్శిస్తున్నాడు' అన్న కారణంగానే బర్తరఫ్ చేసింది. ఆయన కేసిప్పుడు రాష్ట్ర ట్రిబ్యునల్‌లో నడుస్తున్నది. అక్కడి నుండి హైకోర్టుకు అక్కడి నుండి సుప్రీంకోర్టుకూ వీరో, వారో దానిని తీసుకుపోకతప్పదు. చివరికి ఆయన గెలిచినా ఈ లోపల ఎంత నష్టపోతాడు? పి.వి.రావుకు మళ్ళీ ప్రభుత్వ ఉద్యోగం చేయాలన్న ఆసక్తి ఉండకపోవచ్చు. కానీ అభిప్రాయ స్వేచ్ఛను వినియోగించుకోవాలని కోరుకునే ప్రభుత్వ ఉద్యోగులందరూ ఆ స్థితిలో ఉండరు.

వలస కాలంనాటి సర్వీస్ నియమాలు చెక్కు చెదరకుండ ఉండడానికి ప్రభుత్వాలను సులభంగానే తప్పు పట్టవచ్చు. రాజ్యాంగం ఉనికిలోనికి వచ్చిన తరువాత, రాజ్యాంగ ప్రాథమిక హక్కులకు వ్యతిరేకమైన చట్టాలేవీ చెల్లవని రాజ్యాంగమే ఆర్టికల్ 13లో అంటుంది.అటువంటప్పుడు పాత చట్టాలలో ఏవి ప్రాథమిక హక్కులకు అనుగుణంగా ఉన్నాయో ఏవి లేవో పరిశీలించడానికి ఆనాడే ఒక నిపుణుల కమిటీని వేసి, చెల్లని చట్టాలన్నింటినీ తొలగించవలసి ఉండింది. ప్రభుత్వం ఆ పని చేయకుండ, అన్ని వలస చట్టాలను వాడుకుంటూనే ఉంది. బాధితులెవరైనా కోర్టుకు ఎక్కినప్పుడు మాత్రమే ఆర్టికల్ 13 వెలుగులో వాటిని పరిశీలించడం జరిగింది. అప్పుడు కూడ కోర్టు చెల్లవని ప్రకటించిన చట్టాలను వెంటనే రద్దు చేసే ప్రయత్నమూ అన్ని సందర్భాలలోనూ చేయలేదనడానికి సర్వీస్ నియమాలలోని భావ ప్రకటనా స్వేచ్ఛపైన నిషేధం ఒక నిదర్శనం, రాజ్యాంగ ప్రాథమిక హక్కుల విషయంలో మన పాలకుల సీరియస్‌నెస్ అంత.

ప్రభుత్వం సరే, ఉద్యోగ సంఘాలు ఏం చేస్తున్నాయి? సర్వీస్ నియమాలను రాజ్యాంగ ప్రాథమిక హక్కుల వెలుగులో తిరగరాయాలని కనీసం కామేశ్వర్ ప్రసాద్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు తరువాతనయినా ఎందుకు ఆందోళన చేయలేదు? ఉద్యోగ సంఘాలు ప్రధానంగా పైరవీకార్ల సంఘాలు కాబట్టి చేయలేదు. ఈ మాట అంటే నొచ్చుకునే స్థితిలోనయినా వారున్నారో లేదో తెలీదు. పైరవీ చేసుకోవడానికి భావ ప్రకటనా స్వేచ్ఛ అక్కరలేదు. అభిప్రాయ స్వేచ్ఛ అక్కరలేదు. అధికారంలో ఉన్నవారితో తగు సంబంధాలుంటే చాలు.

ఇప్పుడు పాలనా యంత్రాంగానికి దేశ అభివృద్ధిలో ఉన్నచోటే చాలా స్వల్పమని పాలకులు నిర్ణయించుకున్నారు కాబట్టి, అందులో పనిచేసే ఉద్యోగుల అభ్యర్ధనలు వినేవారులేరు. వారి పైరవీలు పనిచేసే రోజులు పోయాయి. అందువల్ల సమ్మె హక్కు మీద నిషేధమూ భావప్రకటనా స్వేచ్ఛ పైన నిషేధమూ కలవరపెడుతున్నాయి. కానీ ఏమైనా చేయడానికి కాలాతీతం అయిపోయిందా అనేది ఉద్యోగ సంఘాలు ఆందోళనకు దిగితే తప్ప తెలీదు. దిగకుండ సుప్రీంకోర్టు తన అభిప్రాయాలను పునస్సమీక్షించుకుంటుందనో లేక వాజ్‌పేయితో బి.ఎం.ఎస్. నాయకులు సోనియాగాంధీతో ఐ.ఎన్.టి.యు.సి. నాయకులు మొరపెట్టుకొని సర్వీస్ నియమాలను సవరింపచేస్తే సరిపోతుందనో ఆశిస్తూ కూర్చుంటే ఫలితందక్కదు.

అయితే ప్రభుత్వ ఉద్యోగులు ఆందోళన చేయాలంటే ప్రజలతో సంబంధాలు ముందు మెరుగుపరచుకోవాలి. దాని అర్థం ఇతర ప్రజా సంఘాల ఆందోళనలలోనూ ధర్నా కార్యక్రమాలలోనూ పాల్గొనడం మాత్రమేకాదు. తాము పనిచేసే క్రమంలో ప్రజలకు శత్రువులుగాకాక స్నేహితులుగా కనిపించాలి. వ్యవహరించాలి.

తమిళనాడు కేసు తీర్పులో సుప్రీంకోర్టు ప్రభుత్వ ఉద్యోగులకేకాక కార్మికులకు కూడ సమ్మెహక్కు లేదన్నదన్న అపోహవల్ల ఉద్యోగులకు ఉద్దరగా కొంచెం సానుభూతి దొరికింది. ఆ తీర్పు కేవలం ప్రభుత్వ ఉద్యోగులకే వర్తిస్తుందని ప్రజలకు అర్థం అయివుంటే ఏ మాత్రం సానుభూతి లభించేదికాదు. ఇది దురదృష్టకరమే కానీ వాస్తవం. దురదృష్టమెందుకంటే ప్రభుత్వ ఉద్యోగుల ఉద్యోగ భద్రత, ఇతర హక్కులు వేగంగా హరించుకుపోతున్నాయి. కొత్తగా ఉద్యోగులయ్యేవారు కాంట్రాక్ట్ ప్రాతిపదికన కొలువులో చేరుతున్నారు. ఆ కాంట్రాక్ట్ నియామకాలలో రిజర్వేషన్లు సక్రమంగా పాటించడంలేదు. ఈ విధంగా చేరినవారి భవిష్యత్‌కు ఏరకమైన గ్యారంటీ లేదు. రెగ్యులరైజ్ అయ్యే హక్కు ఖచ్చితంగా ఉండి కూడ అనేక వేలమంది ఉద్యోగులు దినసరి వేతన ఉద్యోగులుగా దశాబ్దాలు గడిచినా కొనసాగుతున్నారు. కన్సాలిడేటెడ్ పే మీద సంవత్సరాలు గడుస్తున్నా అతి తక్కువ జీతంతో పని చేస్తున్నవారు వేల సంఖ్యలో ఉన్నారు. ఈ స్థితిలో ఉద్యోగులకు ఉద్యమించే హక్కు లేకపోవడాన్ని సాధారణ ప్రజలు నిరసించే స్థితిలో లేకపోవడం దురదృష్టమే.

అయితే ఇది వాస్తవం కూడ. ప్రభుత్వ కార్యాలయాలకు పనిమీద వెళ్ళే ప్రజలను ఉద్యోగులు ఒక న్యూసెన్స్‌గా చూస్తారనేది నూటికి తొంభై శాతం వాస్తవం. పల్లెలలో పనిచేసే ఉద్యోగులు విధులకు సక్రమంగా హాజరుకాకపోవడమూ అటువంటి వాస్తవమే. కరీంనగర్ ఎస్.పి. వామపక్ష అధ్యాపక సంఘాలను ఇబ్బంది పెట్టడం కోసం 'మా ఊరికి రండి, మాతోనే ఉండండి' అంటూ జనచైతన్య వేదిక అనే బోగస్ సంస్థను సృష్టించి ప్రచారం చేయడం సాధారణ ప్రజల దృష్టికి అనవసర ప్రసంగంగా తోచకపోవడానికి ఈ వాస్తవమే కారణం. అధ్యాపకులు డ్యూటీ చేసుకోవాలే తప్ప సమాజాన్ని గురించి రాజకీయంగా ఆలోచించకూడదని చెప్పడం అతని ఉద్దేశ్యం. ఆ అభిప్రాయమే స్పష్టంగా చెప్పే ఆమోదించనివారు సహితం వేరే నినాదాలతో అతను నిర్వహించిన అతి తెలివి ప్రచారాన్ని న్యాయమైనదిగా భావించడానికి గల కారణంపై వాస్తవమే.

ఇంక అవినీతి గురించి చెప్పనవసరమే లేదు. పైసలు రాల్చనిదే ప్రభుత్వ కార్యాలయములో చిన్న పనికూడ జరగని స్థితి వచ్చింది. అవకాశం తక్కువై అవినీతి తక్కువ ఉన్న రంగాలు ఉన్నాయేమో గానీ అవినీతి సర్వసాధారణ విషయమయిపోయిందనేది సత్యం. పెద్దవాళ్ళు అవినీతిపరులయినప్పుడు చిన్నవాళ్ళు కాకుండ పోరనీ, లక్షలలో తినే వాళ్ళను ఆపలేనప్పుడు వందలలోతినేవాళ్ళను నిందించడం ఎందుకనీ వామపక్ష ఉద్యోగ సంఘాలు సహితం వాదిస్తుండడం విచారకరం. అవినీతి వల్ల జరిగేది కొంత మంది కొంత అక్రమ ఆదాయాన్ని పొందడం మాత్రమేకాదు. అంతే అయితే వంద రూపాయలు తినేవాడి గురించి ఆందోళన ఎందుకు అని తీసిపారేయొచ్చు. కానీ అవినీతి తరుచుగా ప్రజల మౌలిక హక్కులకే భంగం కలిగిస్తుంది. కరెంటు కోసం విద్యుత్‌శాఖ మీద ఆధారపడకతప్పని రైతులనడిగితే ఆ విభాగంలో మీదినుండి కిందిదాకా ఉన్న అవినీతి వల్ల ఎంత నష్టం జరుగుతున్నదీ చెప్తారు.

ఉద్యోగ సంఘాలు తమ జడత్వాన్ని గురించీ ఉద్యోగ సంస్కృతిలో స్థిరపడిపోయిన ప్రజావ్యతిరేక ధోరణులు గురించి సీరియస్‌గా ఆలోచించనిదే తమకు కనీసం పౌరహక్కులు కావాలన్న ఆరాటానికి ప్రజల మద్దతు పొందజాలరు. ప్రజల సానుభూతి లేకపోతే వారి ఆరాటానికి ప్రభుత్వం స్పందించదు. ఉద్యోగ సంఘాలు ఈ విషయాన్ని గ్రహించినట్లే ఉన్నాయిగానీ దీనికి సిద్ధంగా లేకపోవడం వల్ల సుప్రీంకోర్టు తమ సమ్మెహక్కు విషయంలో తన అభిప్రాయాలను పునస్సమీక్షించుకోవాలనీ లేదా ఎన్నికల సీజన్ కాబట్టి ప్రధానమంత్రికి వారి పార్టీ ఉద్యోగ సంఘాల వారిచేత చెప్పించి చట్ట సవరణలు చేయించేయాలనీ చూస్తున్నట్టుంది. ఇవి రెండూ జరగవు. న్యాయస్థానాలలోనూ పాలనా విధానాలలోనూ ఉన్న భావవాతావరణం అందుకు అనుకూలంగా లేదు. కాగా, 'ఆర్థిక సంస్కరణల' ఒత్తిడి కూడ ఉద్యోగుల కోరికలను అనుమతించదు.

వేగవంతమైన ఆర్థిక పెరుగుదల రేటు సాధించడానికి విదేశీ పెట్టుబడులపైన ఆధారపడడం అనేది 1990 తరువాత అనుసరిస్తున్న ఆర్థిక సంస్కరణలలోని ప్రధాన అంశం. ఈ విదేశీ పెట్టుబడుల ఆగమనానికి ప్రపంచ బ్యాంకు చేయూత పలు రకాలుగా అవసరం. ఆ చేయూత అందాలంటే వారు చేప్పే పాలనా సంస్కరణలు కూడ అమలు చేయాలి. ఆ సంస్కరణలలోని ముఖ్యమైన రెండు అంశాలు బడ్జెట్ లోటును కుదించడం. పాలనా యంత్రాంగం బలుపునూ బరువునూ తగ్గించడం. ఇది ప్రభుత్వ ఉద్యోగుల ఉద్యోగ భద్రతకూ జీతభత్యాల పెంపుదలకూ వ్యతిరేకం. అందువల్ల, ఉద్యోగ సంఘాలు అనివార్యంగా నిద్ర మేల్కొని చేస్తున్న హక్కుల ఆందోళన సంస్కరణల రాజకీయార్థిక నీతికే వ్యతిరేక మైనది. ఆ విషయం గ్రహించి ప్రజలతో సత్సంబంధాలు పెట్టుకొని ప్రజలలో ఒకరుగా తమ హక్కుల కోసం ఆందోళన చేయడం తప్ప ఉద్యోగులకు వేరే మార్గం లేదు. పైరవీ మనస్తత్వం వీడని నాయకులు వాజ్‌పేయితో ఏదో ఒక రకంగా పైరవీ చేసుకొని గట్టెక్కుదామనుకుంటున్నట్టున్నారు. అది వారి భ్రమ.

❋

---

- చర్చించడం వల్ల, ఒక అంశం గురించి మాట్లాడు కోవడం వల్ల, ఆ విషయం పట్ల కలిగే అవధానం, ఎన్నిసార్లు వల్లె వేస్తే మాత్రం వస్తుంది? ప్రశ్నలతో హోరెత్తించే పిల్లలు చదువు పూర్తయ్యేసరికి మూగమొద్దుల్లా మారిపోతున్నారు. తమ భావాల్ని, అనుభూతుల్ని మాటల్లో వ్యక్తపరచలేని అసహాయుల్లై పోతున్నారు.

  *- గిజుభాయి*

- ఉపాధ్యాయుడు కుమ్మరించిన అంశాన్ని పిల్లలు ఎంత నిర్విరామంగా బుర్రలో నింపుకుంటారో అంతగా వారు వివేచనా కోల్పోతారు.

  *- గిజుభాయి*